క్లుప్తంగా

'సీతక్క'కు సన్మానం



మంత్రి సీతక్కను సన్మానిస్తున్న మహిళా కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్లటౌన్: రాష్ట్ర పంచాయితీరాజ్, శిశు సంక్షేమ శాఖమంత్రి దనసరి అనసూయ (సీతక్క)ను గురువారం జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు కలిశారు. వేములవాడకు వచ్చిన సీతక్కను కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యలక్ష్మి, మడుపు శ్రీదేవి, వెల్ముల స్వరూప తదితరులు పాల్గొన్నారు.

27న చెక్‌ముకి టాలెంట్ టెస్ట్

సిరిసిల్లఎడ్యుకేషన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెక్‌ముకి టాలెంట్ టెస్ట్ ఈనెల 27న జిల్లాలో అన్ని మండలాల్లో నిర్వహించనున్నట్లు జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంపతి రమేశ్ తెలిపారు. గురువారం పాఠశాల స్థాయిలో పరీక్ష పూర్తయిందని, ఆయాపాఠశాలల్లో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన వారు మండల స్థాయి పోటీల్లో పాల్గొలన్నారు.

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని కేజీ టు పీజీ ప్రాంగణంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 27న మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబురాలు నిర్వహించనున్నారు. మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల నుంచి మండలస్థాయికి ఎంపికైన విద్యార్థులు హాజరుకావాలని మండల కన్వీనర్ శీలకుమార్, కో కన్వీనర్ పాశం భాస్కర్ కోరారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రానికి చెందిన మంత్రి ముత్తవ్వ, రేసు భూమయ్య అనారోగ్యంతో మృతిచెందారు. బాధితుల కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య గురువారం పరామర్శించారు. మృతికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు గుల్లపల్లి నర్సింహారెడ్డి, పర్శరాములు, సందీప్, ఎడ్ల లక్ష్మణ్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని తడగొండ, ఎన్నంపల్లి సాయిబాబా, వరదవెల్లి గురు దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో గురువారం పౌర్ణమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తడగొండ సాయిబాబా ఆలయంలో భక్తులు సాయినాథుడిని పల్లకీపై ఊరేగించారు. కార్యక్రమంలో సాయి భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కోనరావుపేట: మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేసి రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వివరించారు. మండల వైద్యాధికారి వేణుమాధవ్, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ కృష్ణవేణి, ప్రిన్సిపాల్‌సాగర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం
- కరీంనగర్‌కు తరలింపు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని పాతబస్టాండ్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స తర్వాత కరీంనగర్ తీసుకెళ్లారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేటకు చెందిన ఎరుపుల బన్నికుమార్, అంతర్పుల నితిన్ పాతబస్టాండ్ నుంచి ఇంటికెళ్తుండగా త్రీవీలర్ వాహనం ఎదురుగా వచ్చింది. దాన్ని తప్పించే ప్రయత్నంలో వేగంగా డీవైడర్‌కు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వాహనం వెనుక కూర్చున్న బన్నికుమార్ రెండు కాళ్లు విరిగాయి. పరిస్థితి విషమంగా మారింది. ప్రస్తుతం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేశారు. నితిన్ స్వల్ప గాయాలతో కోలుకుంటున్నారు.

నాంపల్లి శివారులో మరో యువకుడికి..

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి శివారులోని వేములవాడ–నాంపల్లి ప్రధాన రహదారిలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని స్థానికులు వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఏళ్లుగా అలంకారప్రాయమే

- గ్రామాలకు దూరంగా, పల్లె ప్రకృతి వనాలు
- ఎండుతున్న మొక్కలు
- ఆహ్లాదానికి దూరంగా ప్రజలు



ముస్తాబాద్‌లో ముళ్ల పొదల మధ్య దారిలేని పల్లె ప్రకృతి వనం

ముస్తాబాద్: పచ్చదనం.. ఆహ్లాదం.. గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు అలంకారప్రాయంగా మారుతున్నాయి. ఊరురా పల్లె ప్రకృతి వనాలు నిర్మించాలన్న గత ప్రభుత్వ లక్ష్యాన్ని చేరేందుకే అధికారులు పీపీవీలను నిర్మించారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

ముళ్లపొదల మధ్య..

ముస్తాబాద్ మేజర్ పంచాయతీలో 2020లో పల్లె ప్రకృతి వనాన్ని ఉపాధిహామీ ద్వారా చేపట్టారు. ఈజీఎస్ ద్వారా గుంతలు తీయించగా, పంచాయతీ నిధుల ద్వారా రూ.2లక్షలు వెచ్చించి, అదనంగా మొక్కలు తెప్పించారు. ఫెన్సింగ్, గేట్, మెటీరియల్‌కు ఖర్చుచేశారు. నాలుగేళ్ల క్రితం ముస్తాబాద్ పెద్ద చెరువు కింద నిర్మించిన పల్లె ప్రకృతి వైపు ఇప్పటివరకు ఎవరూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. చెరువు కట్టకింద ఉండటంతో చెరువు జాలుతో అక్కడి ప్రాంతం బురదమయంగా మారింది. కనీసం దారితో పాటు ముళ్లపొదలు ఉండటంతో అటువైపు నడవలేని పరిస్థితి. ఓ వైపు డంపింగ్‌యార్డ్‌తో దుర్గంధం, మరోవైపు రత్నాలకుంట నుంచి వచ్చే దుర్వాసన, శ్మశానవాటిక ఇంకోవైపు ఉండటంతో అక్కడికి వెళ్లేందుకు ప్రజలు భయపడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పట్టణవాసులకు ఆహ్లాదం పంచేందుకు ఏర్పాటు చేసిన పీపీవీలు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. రెండేళ్లుగా ఉపాధిహామీ ద్వారా ఇక్కడ 350 చెట్లకు ఒక్కోచెట్టుకు రూ.5 అందజేశారు. ఇంత ఖర్చు చేసినా మొక్కలు ఎండిపోవడం ఏంటని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మండలంలో పీపీవీల పరిస్థితి..

పోతుగల్‌లోని శ్రీ శివకేశవుల ఆలయం వద్ద దీనిని ఏర్పాటు చేశారు. గతంలోనే ఆలయ కమిటీ దీనిని అభివృద్ధి చేయగా, ఉపాధిహామీ ద్వారా ఏం చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఆవునూర్‌లో గ్రామానికి దూరంగా పల్లె ప్రకృతి వనం ఉండగా దాని పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. కొండాపూర్, చిప్పలపల్లిలో ఊరికి దూరంగా ఉన్నాయి. చీకోడు, మొర్రాయిపల్లెలో శ్మశానవాటిక దగ్గర నిర్మించడంతో జనం అటువైపు వెళ్లడం లేదు. గూడూరులో అదే పరిస్థితి. రాంరెడ్డిపల్లెలో శ్మశానవాటిక దగ్గర ఊరికి దూరంగా నిర్మించారు. నామాపూర్, సేవాలాల్‌తండాలో వినియోగంలో లేవు. ఒక్క మద్దికుంట, మోహినికుంట, రామలక్ష్మణపల్లెలో లక్ష్యానికి అనుగుణంగా పీపీవీలు నడుస్తున్నాయి. గత ఏడాదిగా ఎలాంటి బిల్లులు లేకపోవడంతోనే పల్లె ప్రకృతి వనాలు ఆనవాళ్లు కోల్పోతున్నాయనే విమర్శలున్నాయి.



ఎండిపోయిన మొక్కలు

ఊరికి దూరంగా నిర్మించారు



మండలంలో పల్లె ప్రకృతి వనాల పేరుతో ఉపాధిహామీ నిధులు దోచుకున్నారు. ఊరికి దూరంగా నిర్మించడంతో వృథాగా మారాయి. ఎక్కడ వనాలను ఉపయోగించుకున్న దాఖలాలు లేవు. కనీసం దారి కూడా లేని స్థలాల్లో వీటిని నిర్మించడం వెనుక ఉద్దేశమేంటో తెలపాలి.

– తిరుపతి, మాజీ సర్పంచ్, ముస్తాబాద్

వినియోగంలోకి తీసుకువస్తాం



ముస్తాబాద్ పల్లె ప్రకృతి వనానికి దారి లేదు. దానిని బాగుచేసి ప్రజలు ఉపయోగించుకునేలా చర్యలు తీసుకుంటాం. ఎండిన మొక్కల స్థానంలో కొత్తవి నాటుతాం. పాడుపడ్డ వాకింగ్ ట్రాక్‌ను బాగుచేస్తాం. ప్రజలకు దీనిపై అవగాహన కల్పిస్తాం.

– చెట్టి శ్రీనివాస్, కార్యదర్శి, ముస్తాబాద్

పంచాయతీలదే బాధ్యత



నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో పల్లె ప్రకృతి వనాలను ఊరూరా నిర్మించింది. రెండేళ్లుగా ఈజీఎస్ ద్వారా మెయింటెన్ చేశాం. ఏడాది నుంచి పంచాయతీలకు వాటిని అప్పగించాం. ప్రజలను చైతన్యవంతం చేసి ఉపయోగించుకునేలా జీపీలు చూసుకోవాలి.

– నీర్ల రమాదేవి, ఎంపీడీవో, ముస్తాబాద్

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక, కొత్తపేట, రత్నంపేట గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజల కోసం చేపడుతున్న అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు నవిత, రంగి రేణుక, ఎంపీవో గంగాతిలక్, సూపరింటెండెంట్ రవీందర్, కార్యాలయ టైపిస్ట్ వంశీ, ఐసీడీఎస్, వైద్య సిబ్బంది, నాయకులు రాజు, రంగి తిరుపతి, ల్యాద రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని రాం రెడ్డిపల్లె, గోపాల్‌పల్లె, తుర్కపల్లి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఎల్ఈడీ ద్వారా ప్రదర్శించి అవగాహన కల్పించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో రమాదేవి, వైద్యాధికారి గీతాంజలి, సర్పంచ్‌లు నరేశ్, పోచయ్య, కాశోల్ల పద్మ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

కోనరావుపేట: గ్రామంలో చేసిన అభివృద్ధి పనులు చూసి ఓర్వలేకే మాజీ సర్పంచ్ జవ్వాజి తిరుపతిగౌడ్ అసత్య ఆరోపణలు చేస్తున్నాడని మర్తనపేట సర్పంచ్ వెన్నమనేని వంశీకృష్ణరావు, ఉపసర్పంచ్ మర్రిపెల్లి పర్శరాములు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్లలో గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, చూసి ఓర్వలేని తిరుపతిగౌడ్ ఆరోపణలు, ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతి సర్పంచ్‌గా పనిచేసినప్పుడు అవినీతి అక్రమాలకు పాల్పడ్డాడన్నారు. గ్రామానికి వచ్చిన నిధులు దుర్వినియోగం చేశాడని, మూడురోజుల క్రితం రూ.35,418 జరిమానా కూడా చెల్లించినట్లు పేర్కొన్నారు. గ్రామంలో అక్రమాలపై పాల్పడితే విచారణకు సిద్ధమన్నారు. సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రామచంద్రం, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఎల్‌వోల సమావేశానికి కాంగ్రెస్ శ్రేణులు



హైదరాబాద్‌కు తరలుతున్న కాంగ్రెస్ నేతలు



ముస్తాబాద్ : తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్లటౌన్: హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన బీఎల్‌వోల సమావేశానికి సిరిసిల్ల నుంచి ఆపార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. సిరిసిల్ల నుంచి బస్సుయాత్రను పీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, దేవదాసు, యెల్లె లక్ష్మీనారాయణ, కోడం అరుణ, రోజా తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలపై మాజీ మంత్రి కేటీఆర్ అవాస్తవాలు మాట్లాడటం సరికాదని, అన్ని పథకాలను అమలు చేయనున్నట్లు జరుగుతుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు.హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశానికి మండలకేంద్రం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారం కోల్పోయిన కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, లింగంగౌడ్, గిరిధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి, ఏలూరి రాజయ్య, గుండాడి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కాంగ్రెస్ బూత్‌లెవెల్ ఏజెంట్ల సమావేశానికి మండలం నుంచి ఆ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పార్టీని సమాయత్తం చేసేందుకు బూత్‌లెవెల్ ఏజెంట్ల సభను నిర్వహించినట్లు మండలశాఖ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి తెలిపారు. ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బూత్ లెవల్ కన్వీనర్ల శిక్షణ శిబిరానికి కాంగ్రెస్ మండల నాయకులు తరలివెళ్లారు. మాజీ జెడ్పీటీసీ పులి లక్ష్మీపతి, పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు వంశీ, శ్రీనివాస్ తదితరులున్నారు.

31న మండల సమావేశం

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 31నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందని, ఆయాశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

మహిళ అదృశ్యం



రాజవ్వ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్‌కు చెందిన నేరెళ్ల రాజవ్వ(49) అదృశ్యమైంది. రాజవ్వ కొడుకు జీవన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. తన తల్లి రాజవ్వ మతిస్థిమితం సరిగ్గా లేదని, ఈనెల 2వ తేదీన మధ్యాహ్నం రాజవ్వ బయటకు వెళ్లిపోయింది. అప్పటి నుంచి బంధువుల ఇళ్లతోపాటు సమీప గ్రామాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. కొడుకు జీవన్ ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై సుధాకర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలకేంద్రానికి చెందిన గొర్రె రాము గతనెల 12న పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ ద్వారా ఫోన్‌గుర్తించి గురువారం బాధితుడికి అందజేసినట్లు ఎస్సై తెలిపారు.

పరామర్శ

బోయినపల్లి: చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ భర్త గాలన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. గురువారం బోయినపల్లి ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, మండల సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, తదితరులు బొడిగె శోభను పరామర్శించారు.

ఎస్సైకి సన్మానం



తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళపల్లి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై ప్రశాంత్ రెడ్డిని గురువారం రెడ్డిసంఘం అధ్యక్షుడు ఎడమల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. సిరిసిల్ల సింగిల్ విండో వైస్‌చైర్మన్ వెంకట రమణారెడ్డి, జిల్లా రెడ్డి సంఘం ప్రచార కార్యదర్శి ఎడమల హనుమంత రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, కోశాధికారి జయరాం రెడ్డి, భాస్కర్ రెడ్డి, పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల వివరాలు తెలపాలి

ముస్తాబాద్: ముస్తాబాద్ మేజర్ పంచాయతీ ఆదాయ, వ్యయాలు తెలపాలని మాజీ సర్పంచ్ వొరగంటి తిరుపతి, వార్డుసభ్యుడు బుర్ర రాములు, మాజీ వార్డు సభ్యుడు దీటి నర్సింలు వేర్వేరుగా సమాచార హక్కుచట్టం ద్వారా విజ్ఞప్తి చేశారు. మేజర్ పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలు, బిల్లుల చెల్లింపులు, ఆదాయం, ఇంటి నిర్మాణ అనుమతుల సమాచారం ఇవ్వాలని కోరారు. విచారణ అనంతరమే బిల్లులు చెల్లించాలన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

వేములవాడఅర్బన్: వేములవాడలోని మొదటి బైపాస్‌రోడ్డులోని మహాలక్ష్మి వీధిలో గురువారం జరిగిన ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక మహాలక్ష్మీవీధికి చెందిన రమేశ్ కారులో వేములవాడకు వస్తుండగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ప్రైవేట్ స్కూళ్ల బంద్ విరమించుకోవాలి



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

వేములవాడ: విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఈనెల 27న తలపెట్టిన ప్రైవేట్ స్కూళ్ల బంద్‌ను ట్రస్మా తక్షణమే విరమించుకోవాలని బీఆర్ఎస్వీ నియోజకవర్గ నాయకుడు పోతు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. వేలాది రూపాయలు ఫీజులు చెల్లించి పాఠశాలలకు పంపిస్తున్న ప్రస్తుత తరుణంలో స్కూళ్ల బంద్ పాటించడం సరికాదన్నారు. స్టడీ అవర్స్ పేరుతో ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నారన్నారు. యూనిఫాం పేరుతో విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు దిలీప్, మంత సందీప్, ఎండీ ఫెరోజ్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్బీఐ ఉపన్యాస పోటీల్లో విజేతలు వీరే..

- నగదు పురస్కారాలు అందుకున్న మహతి విద్యార్థులు



బహుమతులు అందుకున్న మహతి విద్యార్థులు

సిరిసిల్లకల్చరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పట్టణంలోని డిజిటల్ బ్యాంక్ యూనిట్ గురువారం నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో స్థానిక మహతి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారు. ప్రథమ బహుమతి సామల నేహ, ద్వితీయ బహుమతి ఎలిగేటి అపర్ణ, తృతీయ బహుమతి సిరిపురం రమ్య సాధించారు. ప్రోత్సాహక బహుమతులు గొల్లపల్లి మలిత, గజభీంకార్ సృజన గెలుచుకున్నారు. వీరికి బ్యాంక్ చీఫ్ మేనేజర్ నాగప్రవీణ్, మేనేజర్ ప్రవీణ్‌బాబు నగదు బహుమతుల తోపాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేతలను కళాశాల కరస్పాండెంట్ పి.రాజు, ప్రిన్సిపాల్ గెంట్యాల భూమేశ్, లెక్చరర్లు నాగుల శరత్, చిటికెన వేణుగోపాల్, డి.లక్ష్మి, చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే సత్యంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నూర్‌భాషా సంఘం ప్రతినిధులు

బోయినపల్లి: మండలంలోని తడగొండకు చెందిన నూర్‌బాషా సంఘం ప్రతినిధులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం కలిశారు. నూర్‌భాషా సంఘం కమ్యూనిటీ హాల్ భవనం నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని కోరగా, దానికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్, మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ. గఫూర్, మండల మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ. అహ్మద్‌హుస్సేన్, కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి మహ్మద్ హుస్సేన్, మోహినొద్దీన్, ఇస్మాయిల్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

పద్యరచనలో రాష్ట్రస్థాయి బహుమతి



గవర్నర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న వైశాలి

సిరిసిల్లఎడ్యుకేషన్: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో జిల్లా విద్యార్థిని జి.వైశాలి పద్య రచనలో ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించినట్లు డీఆర్‌డీవో జె.రవికుమార్ గురువారం తెలిపారు. హైదరాబాద్‌లోని జేఎన్‌టీయులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్ర గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా బహుమతి అందుకుంది.



వేములవాడఅర్బన్: అగ్రహారం కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. 18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ఓటుహక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల తిమ్మాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో ర్యాలీ తీశారు. అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సిరిసిల్ల టౌన్: బాలికల జూనియర్ కళాశాలలో ఓటరు దినోత్సవ ప్రదర్శన



బోయినపల్లి: విలాసాగర్‌లో 'వి' ఆకారంలో విద్యార్థుల ప్రతిజ్ఞ



గంభీరావుపేట : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



కోనరావుపేటలో సీనియర్ సిటిజన్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్